**కథ**

# మేడపైనా అలపైడి బొమ్మా

**"నా పేరు అపరంజి నాయుడుగారూ. సత్యం కంప్యూటర్స్‌లో పనిచేస్తున్నా. ఈ మేడ మీది పోర్షను అద్దెకి తీసుకున్నాను. మీరు చాలా ఏళ్లబట్టీ వుంటున్నారుట కదా. నీళ్లకీ అదీ ఇబ్బందేం లేదుకదా?" అంది ఆ అమ్మాయి.**

చాలా అందంగా వుంది. బంగారు బొమ్మే. జీన్స్ వేసుకుని టీషర్ట్ పైన వేసుకుంది, అందరు కంప్యూటర్ పిల్లల్లాగే ఒక్కటే తేడా పిరుదులు దాటిన పొడుగు జడ.

''శాస్త్రి నీళ్లు బాగానే ఇస్తాడులే. మీ యిద్దరికీ సరిపోతాయి'' అన్నాను.

''ఇద్దరెవరు? నేనొక్కదాన్నే వుంటాను'' అంది.

''నువ్వూ, నీ జడానూ'' అన్నాను.

హ్హా..హ్హా..హ్హా..అని మనోహరంగా నవ్వేసి, ''ఓ అదా! మా అమ్మకి ఇంతకన్నా పొడుగు జడుండేదిట, నేలమీద జీర్లాడుతూ. పెళ్లిచూపుల్లో వంగి ట్రేలో కాఫీ ఇస్తూంటే జడ వెళ్లి నాన్నగారి ఒళ్లోపడిందట. అమ్మ చాలా సిగ్గుపడిపోయిందిట. 'భారతి నన్నానాడే జడతో కట్టి పడేసుకుంది. నువ్వూ అలాగే ఎవర్నో కట్టిపడేసుకో, జడ మటుకు కట్ చేయకు' అంటారు నాన్నగారు. అందుకనే స్టేట్స్‌లో ఎంత ఇబ్బందయినా, అమ్మ జ్ఞాపకార్థం లాంగ్ హెయిర్ మెయిన్‌టైన్ చేస్తూ వచ్చాను. షీ డైడ్ వెన్ ఐ వజ్ ఏన్ ఇన్‌ఫెంట్'' అందా అమ్మాయి కళ్లు కొంచెం చెమర్చుతూ వుంటే. అరమరిక లేని ఆ స్వభావం నన్ను ఆ రోజునుండే ఆకట్టుకుని, ఆ అమ్మాయంటే ఒక అభిమానం కలుగజేసింది.

''నాయుడూ, రెండో ఫ్లోరు పోర్షను కావాలని ఒకతను అడుగుతున్నాడోయ్. రా, మాట్లాడదాం'' అన్నాడు శాస్త్రి ఆ మర్నాడు.

''బ్యాచిలర్నండీ. పేరు భవానీ ప్రసాదు. కొలీగ్స్ బీ.పీ. అంటారు. రీసెర్చి చేస్తున్నాను. ప్రశాంతంగా వుంటుందని ఇటుపక్కకి వచ్చాను. విద్యానగర్‌లో మా యింటినిండా బోలెడు బంధుజనం. పని జరగదు.'' అన్నాడతను వస్తూనే.

ఆ విధంగా అపరంజీ, భవానీ ప్రసాదూ మా ప్రెమిసెస్‌లో ప్రవేశించారు. మర్నాడు నేనూ, శాస్త్రీ ఆరుబయట కూర్చుని వుండగా, అపరంజి ఆఫీసు నుంచి వచ్చి, పైకి వెళ్లబోతూ మెట్లు దూకుతూ భవానీ ప్రసాదు కిందకి వస్తూంటే పక్కకి తొలగి నిలబడింది. శాస్త్రి ఇద్దరినీ ఒకరినొకరికి పరిచయం చేసాడు. ఇద్దరూ పలకరించుకుని వెళ్లిపోయారు.

మా కజిన్ సుదర్శనం కూతురి పెళ్లికి వైజాగ్ వెళ్లి, అదేదో ఫెంగ్‌షూయీ అనే చైనా వాస్తు కళ ప్రదర్శన జరుగుతూంటే, అక్కడ రాళ్లతో చేసిన చెట్టొకటి అపరంజికిద్దామని కొన్నాను. వస్తూనే, చెట్టుపట్టుకుని ఆ అమ్మాయి దగ్గరకెళ్లాను. చూడగానే చాలా సంబరపడిపోయింది.

''ఎంత బాగుందో! దీనికో మంచి ప్లేస్ చూసి పెడతాను, సాయంత్రం'' అని ఆఫీసుకి వెళ్లిపోయింది.

సాయంత్రం ఏడవుతూండగా, ''నాయుడు గారూ'', అని అపరంజి పిలిస్తే, బాల్కనీ వైపు చూసాను.

''ఒక్కసారి రారూ'' అంది.

వెళ్లేసరికి, కూచుని పాదం రుద్దుకుంటోంది.

''ఏవయిందమ్మా?'' అన్నాను ఆదుర్దాగా.

''చెట్టు పైన అరలో పెడుతూంటే కుర్చీ టిల్ట్ అయి పడ్డాను. ఫ్రేక్చరంటారా?'' అంది. ''కాలు విరిగినా ఫర్వాలేదు. చెట్టు మంచి ప్లేస్‌లో పెట్టాను. చూసారా?'' అంది నొప్పితో నవ్వు జోడించి మళ్లీ.

''మంచిదానివే! ఏదీ చూడనీ,'' అని చూద్దునా, నా కళ్లముందే పాదం వాచి నల్లగా కమిలిపోయింది.

''ఫ్రేక్చర్ అనుకుంటా, వుండు. పక్కనే డాక్టరున్నాడు. తీసుకొస్తా'' అని గబగబా వెళ్లాను.

డాక్టరు చూసి ఫ్రేక్చరే అని తేల్చి, కట్టుకట్టి, పెయిన్ కిల్లర్ వేసుకుని, రెస్టుగా వారం పాటుండమని, వెళ్లిపోయాడు.

''వాట్ ఎ న్యూసెన్స్!'' అంది చిరాగ్గా.

''అలాగంటే ఎలాగ? రెస్టుగా వుండు'' అన్నాను.

''పొద్దున్నకి బాగయిపోతాలెండి'' అంది.

★ ★ ★

మర్నాడు పొద్దున్న ఎలా వుందో చూద్దామని వెళ్లేసరికి, భవానీప్రసాదు అపరంజికి కాఫీ ఇచ్చే ప్రయత్నంలో వున్నాడు. ఆ అమ్మాయి ముఖం చూస్తే నొప్పి పెద్ద తగ్గినట్లనిపించలేదు.

''బ్రేక్‌ఫాస్ట్ నేను చేసి తీసుకొస్తాను. లంచ్ కూడా దాంతోనే కానిచ్చేయండి. డిన్నర్ సంగతి నేనొచ్చి ఆర్గనైజ్ చేస్తాను'' అన్నాడతను.

''థేంక్యూ, మిస్టర్ భవానీ ప్రసాద్'' అంది అపరంజి.

''బీపీ అనండి చాలు'' అని అతను తన పోర్షనులోకి వెళ్లిపోయాడు.

★ ★ ★

ఒక వారం పాటు, భవానీ ప్రసాదు అపరంజి అవసరాలన్నీ చూస్తూ, ఎటెండయ్యాడు. ఆ అమ్మాయి ఆఫీసుకి తిరిగి వెళ్లడం ప్రారంభించినా వాళ్ల కామన్ మీల్స్ ఒప్పందం కొనసాగుతూనే పోయింది.

ఒకరోజు అపరంజి శాస్త్రితో, ''గేటు తాళం డూప్లికేట్ ఇస్తారా? బీపీ నేనూ 'సఖి' సినిమాకి వెళ్తున్నాం'' అంది.

శాస్త్రి కొంచెం తటపటాయించి- ''ఫస్ట్‌షోకి వెళ్లచ్చుగా'' అన్నాడు.

''టైమింగ్స్ కుదరవండీ'' అందా అమ్మాయి, అక్కడే నిలబడి. చేసేదేం లేక శాస్త్రి తాళం తీసుకొచ్చి ఇచ్చాడు.

మర్నాడు శాస్త్రి, ''నాయుడూ, గేటు తాళం తీసేసుకో. నాకీ తిరుగుళ్లూ అవీ నచ్చవ్'' అన్నాడు.

''అది వాళ్ల పర్సనల్ విషయం. మనమెవరం విమర్శించడానికి?'' అన్నాను.

''సరేలే. వాళ్ల దగ్గరే వుండనియ్యి'' అన్నాడు.

ఇలా అపరంజీ, భవానీ ప్రసాదూ, ఒక టీమ్ అయిపోయి సమయం గడిపివేస్తుండగా, ఓ సంఘటన జరిగింది. ఇద్దరు అపరిచితులు నా వద్దకి వచ్చి ''భవానీ ప్రసాదు ఇక్కడేనా వుండేదీ?'' అనడిగారు. అవున్నాను. ''ఎక్కడో చూపించండి'' అన్నారు. మేడ మీదకి తీసుకెళ్లాను.

అపరంజి అక్కడ టీవీ చూస్తోంది. నన్ను చూడగానే, ''రండి, నాయుడుగారూ, కొత్తిమీర లేకుండా చారు ఎలా పెడతామండీ? బీ.పీ. తేవడానికి వెళ్లాడు. ఈరోజు వంట నాదీ, బజారు పని అతనిదీనీ'' అంది. నేనేదో అనబోయేలోగా, నా వెనకాతలున్న వాళ్లని చూసి, సంశయంగా లేచి నిలబడింది. వాళ్లేం మాట్లాడకుండా ఇల్లంతా పరికించి చూడ్డం మొదలెట్టారు. ఇంతలో, రెండేసి మెట్లు దూకుతూ ఎక్కి, బీ.పీ. గదిలోకి వచ్చాడు, చేతిలో కొత్తిమీర కట్టలతో.

వాళ్లని చూసి చకితుడై నిలబడిపోయాడు.

''ఎలా వున్నావురా, భవానీ?'' అన్నాడు ఒకాయన.

''ఇదిగో, ఈవిడ తిండిపెట్టబట్టి ఇంకా బతికే వున్నాను'' అన్నాడు బీ.పీ. అపరంజిని చూపిస్తూ. వాళ్లు ఆ అమ్మాయిని అనుమానంగా పరిశీలిస్తూంటే, నేను భరించలేక, ''ఈవిడ పేరు అపరంజి. 'సత్యం'లో సాఫ్ట్‌వేర్ కన్సల్టెంటు'' అన్నాను.

''మీరెవరు?'' అని కూడా అడిగేసాను.

''వీళ్లు మా అన్నయ్యలండీ'' అన్నాడు బీ.పీ. వాళ్లని కూచోమనైనా అనకుండా.

నేను మెల్లిగా అపరంజికి సౌంజ్ఞ చేసి బయట కొచ్చేసాను. ఆ అమ్మాయి తిన్నగా నా వెనకే నా పోర్షనులోకి వచ్చేసి, ''బీ.పీ. అలా కర్ట్‌గా ఎందుకు బిహేవ్ చేసాడండీ?'' అంది.

''ఏమోనమ్మా..ఏదో ఫేమిలీ రిఫ్టేమో! అందుకే ఇంత దూరంగా ఇల్లు తీసుకున్నాడు. సరే, మీ వంట మధ్యలో ఆగిపోయినట్లుంది. నా దగ్గర మినపరొట్టె వుంది. తింటావా?'' అన్నాను. మినపరొట్టె తిని ఆ అమ్మాయి వెళ్లిపోయాక, విషయమేమయి వుంటుందా అని చాలాసేపు ఆలోచిస్తూ వుండిపోయాను.

ఒకనాడు రాత్రి పన్నెండయినా నిద్రపట్టక, కాంపౌండులో వెన్నెలకాంతిలో పచార్లు చేస్తున్నాను. బీ.పీ. కారు పార్క్ చేసి పైకెళ్లబోతూ, నన్ను చూసి ''చూడండి నాయుడుగారూ, ఎంత పర్‌ఫెక్ట్‌గా, స్ట్రెయిట్‌లైన్‌లో పార్క్ చేసానో'' అన్నాడు. అతనీ మాటలంటూంటే గుప్పున కొట్టింది, ఆల్కహాలు వాసన. 'ఇదన్నమాట సంగతి' అనుకున్నాను.

అదొక్కటే సంగతి కాదని ఆ మర్నాడు శాస్త్రి చెప్పిన న్యూస్ విన్నాక తెలిసింది.

''భవానీ ప్రసాదు బ్యాచిలర్ కాదోయ్. పెళ్లయి, ఒక కొడుకున్నవాడు. ఆమధ్య వచ్చిన అతని అన్నలిద్దరూ పేరున్న బిజినెస్ మెన్. అంతా జాయింట్ ఫేమిలీట. ఇతనికి వ్యాపారం చేసే ఇంట్రస్టు లేక ఎకడమిక్స్‌లోకి వచ్చేసాడుట.''

''ఇంత సమాచారం ఎప్పుడు సేకరించావు?'' అన్నాను ఆశ్చర్యంగా.

''మా మేనల్లుడొకడికి వాళ్లన్నలతో పరిచయం. అంతేకాదు, ఇంకా విను. తన తోడికోడళ్లు నగలూ అవీ పెట్టుకుని పెద్ద పెద్ద కార్లలో తిరుగుతూ వుంటే ఇతని భార్యకి న్యూనత. ఇతన్నీ అలాగే సంపాదించమని పోరుతుందిట. ఈ నస భరించలేక ఇతను తాగుడికి అలవాటు పడ్డాడు. దాంతో భార్య గొడవ పడి, పిల్లాడిని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయిందిట. ఇంకో సంగతేమిటంటే, ఇతని వదినలు వీళ్లిద్దరినీ సఖి సినిమాలో చూసారుట. ఇంట్లో చెప్పేసరికి, అన్నలిద్దరూ కాలేజ్‌లో ఎడ్రసూ అదీ ఎక్కలాగి, ఇక్కడికొచ్చారు. వార్నింగివ్వడానికీ, ఇంటికి తిరిగి రమ్మని చెప్పడానికీనీ'' అన్నాడు శాస్త్రి.

''తాగుడు మళ్లీ మొదలెట్టినట్టున్నాడు. అపరంజికి నిజం చెప్పలేకేమో. పూర్తిగా మాటలు మానేసినట్లున్నాడు'' అన్నాను సాలోచనగా.

''అదే మంచిదిలెద్దూ. అయినా ఈ అమ్మాయికీ అంత విచ్చలవిడితనం పనికిరాదు. స్నేహానికి ఒక లిమిటంటూ వుంటుంది'' అన్నాడు శాస్త్రి, జడ్జ్‌మెంటల్‌గా. నాకు కొంచెం కష్టంగా తోచినా అందులో నిజం లేకపోలేదనిపించింది.

ఆ మర్నాడు అపరంజితో, ''హి సీమ్స్ టు బీ ఏన్ ఆల్కహాలిక్'' అన్నాను.

''ఇన్నాళ్లూ అలా లేడే!'' అంది డల్‌గా.

''పెళ్లి కూడా అయి, ఒక కొడుకుట. భార్య సంవత్సరమయి విడిపోయిందిట. అన్నలు కలపడానికి వచ్చారు'' అన్నాను.

''నేనేదో వల్లో వేసుకున్నాననుకున్నారేమో'' అంది.

''అలాంటిదే ఏదో అయుంటుంది. నీకీ విషయం తెలిసాక బాధగా లేదా?'' అన్నాను పరిశీ



సుగుణ

లనగా చూస్తూ.

''బాధ దేనికి? స్నేహం కంటిన్యూ చేయడం లేదని తప్ప ఇంకేం లేదు'' అని ''పోనీ తాగడం, మానేయమని చెప్పనా?'' అంది కళ్లెత్తి.

''ఎందుకుతల్లీ, లేనిపోని గొడవ. వదిలెయ్. అయినా నీ మాట వింటాడని గ్యారంటీ ఏమిటి?'' అన్నాను.

''మంచి ఫ్రెండ్‌గా చెప్తాను. వింటాడు'' అంది నమ్మకంగా.

''నీ ఇష్టం'' అని అంతటితో సంభాషణ తుంచేసాను.

సాయంత్రం నా దగ్గరకొచ్చి కూచుంది.

''చెప్పావా?'' అన్నాను.

''డాబా మీద కూచుని తాగుతున్నాడు. 'హలో' అన్నాను. 'డోంట్ బాదర్ మీ మేడమ్' అన్నాడు. 'ఈ కొత్త పిలుపేమిటీ, మనం స్నేహితులం కదా, అన్నాను', 'నువ్వు పెద్ద ఎగ్జిక్యూటివ్వి, నిన్నలాగే పిలవాలి' అన్నాడు'' అని ఆగింది.

''ఊ...?'' అన్నాను.

''అతనిలో ఇంత హర్ట్ చేసే కెపాసిటీ వుంటుందనుకోలేదు నాయుడుగారూ'' అంది, బుగ్గల మీద నుంచి కన్నీళ్లు కారుతూంటే.

''అంత నొప్పించే మాట ఏమిటన్నాడమ్మా?'' అన్నాను భుజం చుట్టూ చెయ్యేసి.

ఆ చేతిలో ఒదిగిపోయి, నా గుండెలో తలపెట్టుకుని, ''నువ్వు నాకేం కావు. యూ ఆర్ ఎ నాన్ ఎన్‌టిటీ అన్నాడు. ఒక్క ఫ్రెండ్‌గా వుండనివ్వచ్చుగా. ఇన్ని మాటలు దేనికి?'' అంది కళ్లు తుడుచుకుంటూ.

''ఇంకా ఏమన్నాడు?'' అన్నాను ప్రోబ్ చేస్తూ.

''కోమలి జుట్టు నా జుట్టుకన్నా అందంగా వుంటుందిట.'' ''అది భార్య పేరా?''

అవున్నన్నట్టు తలూపింది. నా లాల్చీ అలా తడుస్తూనే వుంది. ఆ క్షణాన నాకు భవానీప్రసాదుమీద పట్టరాని కోపం వచ్చింది. ఎందుకీ పనికిమాలిన కంపేరిజన్స్?

''వూరుకో తల్లీ. అతని ఇన్‌ఫీరియారిటీని ఎలా కప్పిపుచ్చుకోవాలో తెలియక, ఇటువంటి మాటలని నిన్ను కష్టపెడుతున్నాడు'' అని నాకు తెలిసిన సైకాలజీ నాలెడ్జి వుపయోగించి, వూరడించాను.

''ఏమోనండీ, నేనిదంతా భరించలేక పోతున్నాను. ఇంకో ఇంటికి మారిపోతాను'' అంది.

''తొందరపడకు. చూద్దాంలే.'' అన్నాను.

★ ★ ★

ఒకరోజు విశాఖపట్నం నుంచి సుదర్శనం, అల్లుడి వుద్యోగ వ్యవహారం ఏదో చక్కబెట్టడానికి వచ్చి, నన్ను చూసిపోదామని వచ్చాడు.

''సత్యం కంప్యూటర్స్‌లో ఏదో పొజిషనుందిట. నీకెవరైనా తెలుసా అందులో?'' అన్నాడు. అపరంజి దగ్గరకి తీసికెళ్లాను.

కాసేపు ఆఫీసు వ్యవహారాలు మాట్లాడుకున్నాక, సుదర్శనం, ''ఈ చెట్టు నువ్వు వైజాగ్‌లో కొన్నదేగా?'' అన్నాడు ఫెంగ్‌షూయీ చెట్టు చూసి.

''అమ్మాయ్, నీకింకా పెళ్లి కాలేదనుకుంటాను'' అన్నాడు అపరంజితో.

''లేదండీ. ఏం?'' అంది అపరంజి.

''ఈ చెట్టుని పెళ్లి కాని స్త్రీలు డ్రాయింగ్ రూంలో పెట్టుకోకూడదు. పురుషులతో సంబంధాలు దెబ్బతింటాయి. యింగ్, యాంగ్ బ్యాలన్స్ అవవు'' అన్నాడు.

''మా నాన్నగారు నన్ను సాంప్రదాయబద్ధంగా పెంచారండీ. పురుషులతో నేను అక్రమ సంబంధాలు పెట్టుకోను'' అంది అపరంజి స్వరంలో కోపం తొంగి చూస్తూంటే.

''అబ్బెబ్బే. అది కాదమ్మా నా వుద్దేశం. మామూలు స్నేహాలు కూడా సరిగా వుండవు. ప్రకృతి సిద్ధంగా స్త్రీలకున్న ఆకర్షణ కూడా పనిచేయదు'' అన్నాడు సుదర్శనం, దృష్టి అమ్మాయి జడపై నిలుపుతూ. అపరంజి కళ్లు దించుకుంది. ఆ అమ్మాయి మనసులో ఏం కదలాడిందో వూహించగలిగాను.''చెట్టు జాగా మారిస్తే బాంధవ్యాలు బాగుంటాయా?'' అన్నాను.

''పడమటి వైపు బెడ్ రూంలో పెట్టుకోవాలి. అది కూడా, వాళ్లేర్పరుచుకునే అనుబంధాన్ని దృష్టిలో వుంచుకుని'' అన్నాడు సుదర్శనం.

మర్నాడు యధాలాపంగా, ''చెట్టుని బెడ్‌రూం కార్నర్‌లోకి మారుస్తావా?'' అన్నాను అపరంజితో.

''అక్కడే వుండనివ్వండి. ఇంకా ఎంతమంది విరోధుల్ని చేసుకోవాలో?'' అంది పేలవంగా.

ఒక నెలయ్యాక భవానీ ప్రసాదు ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయాడు. అపరంజి పనిలో మునిగిపోయి, నిర్లిప్తంగా అయిపోయింది.

ఒకరోజు నా దగ్గరకు వచ్చి, ''నాయుడుగారూ, నా గెస్ట్‌నొకరిని పరిచయం చేస్తాను రండి'' అని నా చేయి పట్టుకుని పైకి లాక్కెళ్లింది అపరంజి. చాలా రోజుల తరువాత మునుపటి వుత్సాహం ఆ అమ్మాయిలో చూసాను. ''ఈయన మహీధర్ అని మా అమ్మ వైపు బంధువు. నన్ను కలిసి, చూసి రమ్మని నాన్నగారు చెప్పారుట'' అంది టీ నా ముందు పెడుతూ.

పొడుగ్గా, తెల్లగా, ఒకవైపు చెంప జుట్టు కాస్త నెరిసి, చాలా హుందాగా వున్నాడు. కాసేపు మామూలు మాటలు మాట్లాడుకున్నాం.

''టీ చాలా బాగా చేసావే?'' అన్నాను కప్పు కింద పెడుతూ.

''థాంక్యూ'' అంది. కళ్లు వెలుగుతుంటే దాని కారణం పూర్తిగా నా పొగడ్త కాదనిపించింది. తర్వాత మహీధర్‌ని తల్లి గురించి అనేక ప్రశ్నలడిగింది. నేను వెళ్తానని లేవబోయినా చేయి పట్టుకుని కూచోపెట్టేసింది.''ఆదివారం మహీ లంచ్‌కొస్తున్నారు. మీరూ రావాలి'' అంది.

''నేనెందుకమ్మా...'' అనబోయి ఆ కళ్లల్లోని అభ్యర్థన చూసి ''సరేలే'' అనేసాను.

★ ★ ★

శనివారం శాస్త్రి బందువొకడికి సీరియస్‌గా వుందంటే, చూడ్డానికి వెళ్లాను. ఆ రోజంతా అపరంజిని కలవలేదు.

ఆదివారం లంచ్‌కి ఠంచనుగా టైముకి వెళ్లాను. మహీధర్ టీవీ చూస్తున్నాడు. అపరంజి వంటింట్లో గిన్నెలు చప్పుడు చేస్తోంది. మేవేవో పొలిటిక్స్ చర్చించుకుంటూంటే, ''లంచ్ ఈజ్ రెడీ'' అని పిలిచింది. పులావ్ సువాసనలు వెదజల్లుతోంది. ఆ మాటే చెపుదామని అపరంజి వైపు చూసి, నిర్ఘాంతపోయాను. చీర కట్టుకుని వుంది. అంతేకాదు.. జుట్టు షార్ట్‌గా, స్టైల్‌గా బాబ్‌కట్ చేయించేసుకుంది. నా మొహం మీద ఎక్స్‌ప్రెషన్ చూసి చిరునవ్వు నవ్వింది.

''నాన్నగారు కాబట్టి జడ ఒళ్లో పడినా అమ్మని కట్టుకున్నారు. అంతా అలా వుండద్దూ?'' అని మహీధర్ వైపు చూసింది. ఆ చూపులోని వూహకందని భావమేదో అతనికి అర్థమయిన ట్లుంది.

''షార్ట్ హెయిర్ ఈజ్ ఫైన్. సో ఈజ్ యువర్ పులావ్'' అన్నాడు తింటూ.

పిల్ల తెమ్మెర ఒకటి కిటికీలోంచి వీచి బెడ్‌రూం కర్టెన్‌ని పైకి ఎగరేసింది. అప్పుడు చూసాను. ఫెంగ్‌షూయీ చెట్టు పడమటి వైపు కార్నర్‌లో పెట్టి వుంది. అపరంజికేసి చూసి కళ్లెగరేసాను. నవ్వింది.

కిటికీలోంచి మళ్లీ ఒక చల్లని తల్లిగాలి వచ్చి, నవ్వుతున్న అపరంజి జుట్టు నిమిరింది. ❀

